ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 25.3
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 20 ఆగస్టు 2024





• బోధన్ రోడ్ లోని పాఠశాల వద్ద నీట మునిగిన రోడ్లు

• భీంగల్‌లో అత్యధికంగా 103.8 మిల్లీమీటర్ల వర్షం
• చెరువులను తలపించిన నగర రోడ్లు
• భారీగా వరద చేరడంతో రోడ్లపైనే నిలిచిపోయిన వాహనాలు
• రైల్వేకమాన్ వద్ద వరదలో చిక్కుకున్న బస్సు
• ఈదుకుంటూ బయటకు వచ్చిన ప్రయాణికులు



• రైల్వే స్టేషన్ ఎదుట నిలిచిన వర్షపు నీరు

• బోధన్ రోడ్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

దంచికొట్టిన వాన

జిల్లాలోని పలు మండలాలతోపాటు జిల్లా కేంద్రంలో వర్షం దంచి కొట్టింది. కుండపోత వర్షంతో నగరం అతలాకుతలమైంది. రోడ్లన్నీ నీళ్లతో పోటెత్తగా రోడ్లపై వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. గంటన్నరకు పైగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాళాలు ముంచెత్తడంతోపాటు నీళ్లు రోడ్లపైన నిండి చెరువును తలపించాయి. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకు నీళ్లు నిండిపోవడంతో వాహనాలు సుమారు అర్ధగంటపాటు నిలిచిపోయాయి. రైల్వేకమాన్ వద్ద ఒకేసారి వరద భారీగా చేరడంతో హైదరాబాద్ నుంచి వస్తున్న బస్సులోకి నీళ్లు చేరగా ప్రయాణికులు దిగి ఆ నీటిలోంచి బయటకు వచ్చారు.



• రైల్వే కమాన్ వద్ద వరద నీటిలో చిక్కుకున్న బస్సు







• నిజాం కాలనీలో చేరిన వర్షపు నీరు



సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు

నిజామాబాద్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగరంతో పాటు పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒకేసారి కుండపోతగా గంటన్నరపాటు వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షానికి నగరంలోని అన్నికాలనీలు జలమయమయ్యాయి. పలురోడ్లు చెరువులను తలపించాయి. నగరంలో భారీ నుంచి అతిభారీ వర్షం పడటంతో రోడ్లపైనే వరద పొంగిపొర్లింది. పలు ప్రాంతాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. బోధన్‌రోడ్ నుంచి ఆర్మూర్‌రోడ్ వరకు, హైదరాబాద్ రోడ్ నుంచి వర్నిరోడ్ వరకు భారీగా నీళ్లు చేరాయి. నాళాలు సక్రమంగా లేకపోవడం మురికి కాలువలు వెడల్పు లేకపోవడం భవనాలు అతిక్రమించి మురికి కాలువలు కట్టడంతో భారీగా వరదచేరింది. కొన్నిచోట్ల పోలీసులు వాహనాలను మళ్లించి ఇతర రోడ్ల వైపు నుంచి తరలించారు. నగరం పరిధిలోని రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌వరకు భారీగా నీళ్లు చేరి చెరువు తలపించింది. బస్టాండ్ నుంచి పాత కలెక్టరేట్ వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రైల్వేస్టేషన్ మొత్తం జలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదు ర్కొన్నారు. కొన్నిపాఠశాలల్లోనూ నీళ్లుచేరాయి.

• వరదలో ఈదుకుంటూ వచ్చిన ప్రయాణికులు

నగరంలో కుండపోత వర్షానికి రైల్వేకమాన్ అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద చేరింది. ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు కమాన్ రోడ్‌లో బ్రిడ్జి కింద భారీగా వరద రావడంతో నీళ్లు నిలిచిపోవడం వల్ల చాలాసేపు వాహనాలను నిలిపివేశారు. వరద ఐదు ఫీట్ల వరకు చేరడంతో హైదరాబాద్ నుంచివస్తూ బస్టాండ్‌కు వెళ్తున్న బస్సు నీళ్లలో నిలిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులు ఆ వరదలోనే ఈదుకుంటూ బయటికి వచ్చారు. మున్సిపల్ కార్మికులతో రైల్వేకమాన్ వద్ద వరదకు కొట్టుకువచ్చిన చెత్తచెదారాన్ని తొలగించారు.

• భీంగల్‌లో 103.8 మి.మీ. వర్షం

నిజామాబాద్ నగరంతోపాటు భీంగల్‌లోనూ భారీ వర్షం కురిసింది. భీంగల్‌లో 103.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఇతర మండలాల్లో కూడా భారీగా వర్షం నమోదైంది. నిజామాబాద్ సౌత్ మండలంలో 83.5 మి.మీ. వర్షం పడగా, నార్త్ మండలం పరిధిలో 73.3 మి.మీ. వర్షం నమోదైంది. కమ్మర్‌పల్లి మండలం కోనసముంద్రంలో 61.3 మి.మీ. వర్షం నమోదైంది. నిజామాబాద్‌నార్త్ గూపన్‌పల్లిలో 59.5 మి.మీ. వర్షం పడింది. మండలాల్లో ఒక మిల్లీమీటర్ నుంచి 46 మి.మీ. వరకు వర్షపాతం నమోదైంది. భీంగల్, నిజామాబాద్, మెండోరా, బోధన్, ఎడపల్లి, నందిపేట్, ఇందల్వాయి, బాల్కొండ, డొంకేశ్వర్ మండలాల్లో ఈ వర్షం పడింది. మిగతా మండలాల్లో 1 నుంచి 15 మి.మీ. లోపు వర్షం నమోదైంది. జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇదే అత్యధిక వర్షం అని వాతావరణ శాస్త్ర వేత్తలు అంచనా వేస్తున్నారు.

• వాగుల్లో భారీగా వరద

జిల్లాలో పలు మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో వాగుల్లోకి భారీగా వరద చేరుతోంది. కప్పలవాగు, పెద్దవాగుతోపాటు పూలాంగ్‌వాగులో కూడా వరద ఎక్కువ మొత్తంలో చేరింది. చెరువుల్లోకి భారీగా నీళ్లు చేరుతున్నాయి. భారీ నుంచి భారీ వర్షం పడటంతో కొన్నిగ్రామాల పరిధిలోని చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటాయని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగం కూడా ఏర్పాట్లలో నిమగ్నమైంది. అన్ని మండలాల పరిధిలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశాలు ఇచ్చారు.

అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనుల రాళ్ల దాడి

• ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన అటవీ శాఖాధికారులు
• గిరిజనుల రాళ్ల దాడి.. ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన జంగిలోడి తండావాసులు



జంగిలోడి తండాలో అటవీ, పోలీసు సిబ్బందిపై రాళ్లతో దాడి చేస్తున్న గిరిజన మహిళ

సిరికొండ, ఆగస్టు 19: ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనులు రాళ్లతో దాడి చేసిన ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని సిరికొండ మండలం జంగిలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని 397కంపార్టుమెంట్‌లో గ్రామానికి చెందిన గిరిజనులు అటవీ భూమిలోని చెట్లు నరికి ఆక్రమించుకున్నారు. ఇటీవలే ఆభూమిలో పంటలు కూడా సాగు చేస్తున్నారు. అయితే ఈ సమచారం అందుకున్న అటవీ శాఖాధికారులు సోమవారం భారీ పోలీసు బందోబస్తుతో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడానికి జంగిలోడి తండాకు వెళ్లారు. గిరిజనులు సాగుచేసిన పంటలను జేసీబీలతో తీసివేసేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా.. గ్రామానికి చెందిన గిరిజన మహిళలు, యువకులు ఒక్కసారిగా తరలొచ్చారు. పంటలను ఎందుకు తీసి వేస్తున్నారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అడ్డుకున్నా.. వారు వినలేదు. పైగా అటవీ, పోలీసు సిబ్బందిపై గిరిజనులు రాళ్లతో దాడి చేశారు. ప్రాణాలైనా ఇస్తాము కానీ భూములను వదిలేది లేదని తేల్చిచెప్పారు. ఈ రాళ్ల దాడితో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి భారీ పోలీసు బందోబస్తుతో జంగిలోడి తండాకు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత వచ్చి అటవీ భూమిని ఆక్రమించుకున్న వారితో పాటు దాడికి పాల్పడిన వారిపైనా చర్యలు తీసుకోవాలని ఏసీపీ రాజవెంకటరెడ్డిని కోరారు. దీంతో పోలీసులు దాడికి పాల్పడిన గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

జిల్లా సహకార శాఖలో బదిలీలు

నిజామాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా సహకార శాఖలో పలువురు సహాయ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ సహకార శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.స్వప్నను ఆర్మూర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, నిజామాబాద్‌లోని డీసీవో ఆఫీస్‌లో పనిచేస్తున్న సీహెచ్ మల్లేష్‌ను జగిత్యాల జిల్లా కోరుట్లకు బదిలీ చేశారు. ఆర్మూర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.సత్యనారాయణరావును డిచ్‌పల్లికి నియమించారు. నిజామాబాద్ డీసీవో కార్యాలయంలో పనిచేస్తున్న దేవకళను రుద్రూర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు. నిజామాబాద్ డీసీవో కార్యాలయంలోని టి.సరస్వతిని నిజామాబాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు. డిచ్‌పల్లిలో పనిచేస్తున్న పోశన్నను డీసీవో కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు. నిజామాబాద్ రూరల్‌లో పనిచేస్తున్న పి.మురళిని నిజామాబాద్ డీసీవో కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు. బాల్కొండలో పని చేస్తున్న కె.రమావతిని నవీపేట అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

• తొమ్మిదిమంది సీనియర్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

జిల్లాలో సీనియర్ ఇన్స్‌పెక్టర్లుగా పనిచేస్తున్న తొమ్మిదిమంది బదిలీఅయ్యారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న జియాఉద్దీన్‌ను నవీపేట సీనియర్ ఇన్స్‌పెక్టర్‌గా, నవీపేటలో పనిచేస్తున్న హీనాకౌసర్‌ను నిజామాబాద్‌కు బదిలీచేశారు. నిజామాబాద్ డీసీవోలో పనిచేస్తున్న డి.మయూరిని డిచ్‌పల్లికి, ఆర్మూర్‌లో పనిచేస్తున్న మరియా పుష్పకుమారిని రుద్రూర్‌కు, ఆర్మూర్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను నిజామాబాద్ డీసీవో కార్యాలయానికి బదిలీఅయ్యారు. బాల్కొండలో పనిచేస్తున్న కె.బాబురావును ఆర్మూర్‌కు, రుద్రూర్‌లో పని చేస్తున్న రియాజ్ ఉద్దీన్‌ను రుద్రూర్ లోనే పూర్తిస్థాయి నియామకం చేశారు. డిచ్‌పల్లిలో పనిచేస్తున్న రమేష్‌రావును బాల్కొండకు, రుద్రూర్‌లో పనిచేస్తున్న ఎల్.లావణ్యను డిచ్‌పల్లికి బదిలీ చేశారు. ఆర్మూర్‌లో జూనియర్ ఇన్స్‌పెక్టర్‌గా సహకార శాఖలో పనిచేస్తున్న టి.శంకర్‌గౌడ్‌ను నవీపేటకు నియమించారు.




• సోమవారం కురిసిన వర్షానికి కోజా కాలనీల్లో భారీగా నిలిచిన నీరు

• మాస్టర్‌ప్లాన్‌ను పట్టించుకోని అక్రమార్కులు
• ఆక్రమణలతో మాయమవుతున్న చెరువులు, డ్రైనేజీ కాల్వలు
• వర్షపు నీరు పోయేందుకు దారి లేక రోడ్లపైనే వరద

నగరంలో ఇష్టారాజ్యంగా..

కబ్జాలు, అక్రమ కట్టడాలు!



నిజామాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలో అక్రమకట్టడాలు, చెరువుల ఆక్రమణ ఇష్టరాజ్యంగా సాగుతున్నాయి. ఫలితంగా చెరువులు, డ్రైనేజీ కాల్వలు మాయమవుతున్నాయి. నగరంగా అభివృద్ధిచెందినా సక్రమమైన డ్రైనేజీ నిర్మాణం లేక కొత్తనిర్మాణాలు వచ్చినా మాస్టర్‌ప్లాన్‌ను పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల సమయంలో వరద రోడ్లు, ఇళ్లలోకి చేరడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి నిజామాబాద్ నగరం పరిధిలోని చెరువులు, కుంటలుకబ్జా కావడంతోపాటు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు జరగకపోవడంతో వరద రోడ్లపైనే నిలుస్తోంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతోపాటు రోడ్ల నిర్మాణానికి వందల కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదు. నాళాలపైన అక్రమనిర్మాణాలు తొలగించకపోవడం చెరువు శిఖంలను కాపాడకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురవుతుంది.

• గంటన్నర వర్షానికే జనజీవనం అతలాకుతలం

నిజామాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారి నగరం అభివృద్ధి చెందుతున్నా సరైన డ్రైనేజీల నిర్మాణం లేక కాలనీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. భారీవర్షాల సమయంలో వరద ఇళ్లలోకి చేరడంతో సమస్యల తీవ్రమవుతోంది. నగరంలో సోమవారం గంటన్నరపాటు కురిసిన భారీ వర్షానికే జనజీవనం అతలా కుతలమైంది. నగరంలోని అన్ని రోడ్లపైన వరద నీళ్లు భారీగా నిలిచిపోయాయి. పలు ప్రధాన రోడ్లు చెరువులను తలపించాయి. ప్రధాన రోడ్ల వెంబడి మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడం నాళాలు వెడల్పు చేయకపోవడం రోడ్లను అభివృద్ధిచేసి డివైడర్లు నిర్మించినా డ్రైనేజీలు పెంచకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. నగరం పరిధిలోని పలు వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేపట్టిన నాళాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడంతో సెల్లార్‌లోనూ నీళ్లనిలిచాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతోపాటు డ్రైనేజీల నిర్మాణానికి వందల కోట్లు ఖర్చుపెట్టినా ఫలితం కనిపించడంలేదు. నగరంలో సోమవారం కురిసిన గంటన్నర వర్షానికే ప్రధాన రోడ్లన్నీ నీళ్లతో నిండిపోవడంతో ప్రజలు, వాహనదారులు సమస్యలు ఎదుర్కొన్నారు. పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులతోపాటు రాఖీ పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చినవారు కూడా వరదలో చిక్కుకుపోయిన దుస్థితి ఏర్పడింది. నగరం పరిధిలో 20ఏళ్లలో అనేక కుంటలు, చెరువులు కబ్జాలకు గురయ్యాయి. ప్రధాన వాగు పూలాంగ్ వెంబడి కూడా అక్రమ నిర్మాణాలు పెరిగాయి. పాత రెవెన్యూ సర్వే నెంబర్లను చూపి అక్రమ నిర్మాణాలు సాగాయి. ఇళ్లనుంచి అపార్ట్‌మెంట్ల వరకు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని నగర ప్రజలు చెప్తున్నారు. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి చేస్తే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదని అంటున్నారు. నగర కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను గతరెండు దశాబ్దాలుగా పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని తెలుస్తోంది. ఇళ్ల నిర్మాణం పెరిగిన తర్వాత అవి ఎక్కడికక్కడ కబ్జాలకు గురయ్యాయి. ప్రధానంగా పూలాంగ్ వాగుతోపాటు ఇతరవాగులు కూడా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో ఒక ప్రణాళికతో నిర్మాణం చేయడంతోపాటు డ్రైనేజీల నిర్మాణం చేస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు. భవిష్యత్తులో వచ్చే వర్షాలు, వరదలను దృష్టిలో పెట్టుకొని నగరం పరిధిలో ఎక్కువగా నీటమునిగే కాలనీలు, రోడ్లను గుర్తించి ముందస్తు చర్యలను నగర పాలక సంస్థ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు చేపడితే మేలు జరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

• సోదరులకు రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు • చెట్లకు రాఖీలు కట్టిన విద్యార్థులు



సీఎంకు రాఖీ కడుతున్న ఆకుల లలిత



అదనపు కలెక్టర్ అంకిత్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు19: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మహిళలు జరుపుకునే రాఖీ పండుగను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామాలలో మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి దీవెనలు తీసుకున్నారు. తోడబుట్టిన ఆడబిడ్డలకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామనే ప్రతిజ్ఞతో సోదరులు రాఖీలు కట్టుకున్నారు. సోదరీమణులు లేని ఇండ్లలో ఆడపిల్లలు, పెద్దవారు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా రాఖీ పండుగ సందర్భంగా తమ ఇండ్లకు చేరి సోదరులకు రాఖీలు కట్టారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత

రాఖీ పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సోదరునిగా తనను ఆశీర్వదించాలని కోరారు.



చెట్లకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

అదనపు కలెక్టర్లు, కలెక్టరేట్ సిబ్బందికి రాఖీ కట్టిన చిన్నారులు, బ్రహ్మకుమారీలు

రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్రహ్మకుమారీలు, పలువురు చిన్నారులు కలెక్టరేట్‌లోని సిబ్బందికి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లకు రాఖీలు కట్టారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు సైతం అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టారు.

చెట్లకు రాఖీ కట్టిన విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని జీపీఎస్ కోటగల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రాఖీ పండుగను వినూత్నంగా జరుపుకున్నారు. పాఠశాలఆవరణలోని చెట్లకు రాఖీలు కడుతూ మేము మీకు రక్షణగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. చెట్లను రక్షిస్తే పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా చెట్లు మనకు నీడను, ప్రాణవాయువును అందిస్తాయని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ గైక్వాడ్, పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూడాల నిరసనలు


నిరసన తెలుపుతున్న జూడాలు

పెద్దబజార్, ఆగస్టు 19: ప్రభుత్వ వైద్యకళాశాలలు, ఆసుపత్రులలో డ్యూటీ డాక్టర్లకు సరైన డ్యూటీ రూమ్‌లు, వాష్‌రూమ్‌లను అందించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ఓపీ సేవలు, ఎంపిక చేసిన వార్డులు, శస్త్రచికిత్సలను బహిష్కరిస్తూ ఆరో రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఆర్జికర్ మెడికల్ కళాశాల బాధిత మహిళలకు న్యాయం జరగాలన్నారు. సీబీఐ విచారణ, సుప్రీంకోర్టు నుం చి ఫాస్ట్‌ట్రాక్ న్యాయం జరగాలని కేంద్ర రక్షణ చట్టం యొక్క అత్యవసర అమలు చేయాలని ఆసుపత్రిలలో అవసరమైన ప్రాంతాల్లో సిసిటివి ఏ ర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, ఆసుపత్రులలో స్పె షల్ బలగాలతో భద్రత సిబ్బందిని పెంచాలన్నారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళల ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కోసం మహిళా భద్రత విభాగాన్ని సృష్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడా జిల్లా అధ్యక్షుడు జితిన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా అధికారులు చొరవ చూపాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు19: జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణాల మాఫీ కింద లబ్ధి చేకూరేలాగా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్ అన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సోమవారం సాయంత్రం మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే మూడువిడతల్లో రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందని ఆయన అన్నారు. సాంకేతిక కారణాలతో అర్హులైన వారికి రుణమాఫీ జరగకుంటే కారణాలు పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో రుణమాఫీపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తనదృష్టికి వెంటనే తీసుకురావాలని ఆయన అన్నారు. రైతులకు రుణమాఫీ వర్తించే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. రైతులు ఫిర్యాదులు చేస్తే స్పందించకుండా ఉండవద్దని ఆయన కోరారు. మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి రుణమాఫీ అయ్యే విధంగా చూడాలన్నారు.

20 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలి..

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల 20నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వేచేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఓటరు జాబితా ప్రకారం ప్రతీ ఓటరు వివరాలను పరిశీలించాలన్నారు. ఈ మేరకు బీఎల్‌వోలకు పూర్తి అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు, మృతిచెందారా వంటి అంశాలు ఉంటే నోట్ చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నాయా పరిశీలించి ఫోటో స్పష్టంగా ఉందో లేదో చూడాలన్నారు. ఈ ఓటరు జాబితా ఆధారంగానే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నందున పూర్తిస్థాలో పరిశీలించాలని కోరారు. మండలాల పరిధిలో ధరణి పెండింగ్ దరఖాస్తులను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, అధికారులు ఉన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఆగస్టు19: శ్రావణమాసం మూడవ సోమవారం పౌర్ణమి సందర్భంగా సిద్దులగుట్టపై భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతలతో అభిషేకంచేశారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి కుటుంబసమేతంగా విచ్చేసి శివాలయం, రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు, ఆర్మూర్ భజనమండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భక్తిశ్రద్దలతో పాడారు. భక్తులందరికీ ఆలయకమిటీ వారు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, జిమ్మి రవి, చెందేసి శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, అజరీ సతీష్, బోండ్ల ఆనంద్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బుద్దె రాజేశ్వర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బోధన్ రూరల్, ఆగస్టు 19: సాలూర మండలకేంద్రంలో సోమవారం ఉద్యమ నాయకుడు, సీనియర్ రాజకీయ నాయకులు బుద్దె రాజేశ్వర్ విగ్రహ ఏర్పాటుకు వివిధపార్టీల నాయకులు సోమవారం సాలూర గ్రామంలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ గిర్ధావర్ గంగారెడ్డి మాట్లాడుతూ బుద్దె రాజేశ్వర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాలమరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులతో పాటు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలకు గీతకార్మికులు సిద్ధంగా ఉండాలి'

పెద్దబజార్, ఆగస్టు19: సమస్యలపై పోరాడేందుకు గౌడ, గీత కార్మికులు సిద్ధంగా ఉండాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారుడు పెద్దివెంకట్రాములు అన్నారు. సోమవారం నగరంలోని నాందేవ్‌వాడలోగల కార్మిక భవన్‌లో అమరుల యాదిలో గౌడ గీతన్న చైతన్య యాత్రను జయప్రదం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి సర్వాయి పాపన్న 374 జయంతి 18వ తేదీ వరకు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అమరుల యాదిలో గౌడ గీతన్న చైతన్య యాత్ర నిర్వహించాలన్నారు. గీత వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అమరులను స్ఫూర్తిగా తీసుకొని సర్వాయి పాపన్న పోరాట దక్షితను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో పోరాటమే మార్గం అంటూ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, జిల్లా కమిటీ సభ్యులు కొయ్యాడి నర్సింలుగౌడ్, శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వేల్పూర్ గ్రామీణ రోడ్లకు సంతరించుకున్న కొత్త శోభ


వెంకటాపూర్ - కోమన్‌పల్లి, కుకునూర్ మీదుగా నిర్మించిన బీటీ రోడ్డు


మోతె నుంచి అక్లూర్ మీదుగా నిర్మించిన బీటీ డబుల్‌రోడ్డు


జాన్కంపేట్ - సాహెబ్‌పేట్ మీదుగా వేల్పూర్‌కు నిర్మించిన బీటీ

వేల్పూర్, ఆగస్టు19: ఏళ్ళ తరబడి మరమ్మతులకు నోచుకోలేక గుంతలు, కంకరరాళ్లు తేలి వాహనదారులతో పాటు పాదచారులు నడవలేనంతగా మారిన వేల్పూర్ మండల గ్రామాల్లో రోడ్లు వివిధ పథకాల నిధులతో కొత్త శోభను సంతరించుకున్నాయి. వర్షాకాలంతో సమయాల్లో కూడా రోడ్లపై వెళ్లాలంటే నరక ప్రాయాంగా ప్రయాణించే గ్రామీణులు వి విధ పథకాల పుణ్యమ అంటూ బీటీడబుల్ రోడ్డుగా రూపుమారాయి. ప్రస్తుతం ఈరోడ్ల పై ఉల్లాసంగా ప్రజలు ప్రయాణిస్తున్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఇతర పథకాలకు చెందిన కోట్లాది నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లుగా మారిప్రజల ప్రయాణానికి సౌకర్యంగా తయారయ్యాయి. ఎమ్మెల్యేప్రశాంత్‌రెడ్డి రోడ్డు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పట్టుదలతో బాల్కొండ నియోజక వర్గంలోని మారుమూల గ్రామాలను సైతం అన్ని మండలాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మించారు. అందులో భాగంగా వేల్పూర్ మండలంలోని సీఆర్ఎప్ నిధులు రూ.36కోట్లతో జాన్కంపేట్, సాహెబ్‌పేట్, వేల్పూర్ మీదుగా వెంకటాపూర్, కోమ న్‌పల్లి, కుకునూర్ నుంచి అంక్సాపూర్ వరకు 63వ జాతీ యరహదారిని కలుపుతూ బీటీడబుల్ రోడ్డు నిర్మించారు.ప్లాన్‌వర్క్ నిధులు రూ.6కోట్ల 60 లక్షలతో మోతె నుంచి అక్లూర్ మీదుగా బడాభీంగల్ రోడ్డుకు కలుపుతూ బీటీడబులరోడ్డు నిర్మించారు.పీఆర్‌నిధులతో పచ్చలనడ్కుడ నుంచి అక్లూర్ బీటీరోడ్డు నిర్మించారు.వేల్పూర్ వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి అమీనాపూర్ గ్రామానికి బీటీరోడ్డు నిర్మించారు. ఈ రోడ్ల నిర్మాణం కావడంతో గ్రామీణ రోడ్లకు కొత్తకళ సంతరించుకుంది.దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు హ ర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఎస్సీసబ్‌ప్లాన్ ద్వారా రూ.5 కోట్ల88లక్షల నిధులతో పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్‌కు బీటీ డబుల్‌రోడ్డు ప నులు చురుకుగా సాగుతున్నాయి, రూ.4 కోట్ల 20లక్షల నిధులతో పచ్చల నడ్కుడ నుంచి వాడి గ్రామానికి సింగిల్ లైన్ రోడ్డును డబుల్ లైన్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.రూ.9కోట్లనిధులతో పచ్చలనడ్కుడనుంచికొత్త పలి (ఎన్)మీదుగా చింతలూర్ వరకుడబుల్ బీటీరోడ్డుపనులు నడుస్తున్నాయి.

'న్యాయవాదిపై చేయి చేసుకున్న పోలీసులను సస్పెండ్ చేయాలి'


బోధన్‌లోలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బోధన్‌రూరల్,ఆగస్టు19: బోధన్ కోర్టు న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఆదివారం కూకట్‌పల్లి కోర్టు న్యాయవాది సంతోష్‌పై పోలీసులు ఒక కేసులో చేయి చేసుకుని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని బోధన్ బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. న్యాయవాది సంతోష్‌పై దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంత్ రావు, సంగ్రామ్, ఈశ్వర్, కోర్టు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

● విధుల నుంచి ఎస్సై జమాల్‌ను తొలగించాలి..

ఆర్మూర్‌టౌన్: బోర్‌బండ ఎస్సై జమాల్‌ను తక్షణమే సర్వీస్ ఉంచి తొలగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూక ట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయ వాది సంతోష్‌పై బోర్‌బండ ఎస్సై జమాల్ దాడి చేయడం సరియైన పద్దతి కాదని, వరుసగా న్యాయవాదులపై పోలీసులు దురుసుగా మాట్లాడుతూ దాడు లు చేస్తున్నారని, తక్షణమే ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యా యవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. అంతకు ముందు న్యాయవాదికి దాడికి నిరసనగా న్యాయవాదులువిధులను బహిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్, సురేష్, పండిత్, శ్రీధర్, తులసీదాస్‌క్రాంతి, జీజీ.రాం, ప్రవీణ్, జగన్, రాజేశ్వర్, అశోక్, గణేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ డే


ఫొటోగ్రాఫర్లను సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు19: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రాఫీ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్‌లు పటిలివంటి రమేష్, చావెల్ బాల్‌రాం, దమ్మాయి శివలను పటు శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, కార్యదర్శి మ్యాక శ్రీకాంత్, కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు రఫీయోద్దీన్, వెంకట్రాంరెడ్డి, ద్యాగ ఉదయ్, అంబాల్ల తిరుపతి, శ్రీధర్, చంద్రశేఖర్, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

● జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫొటోగ్రాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు ఫొటోగ్రాఫర్‌లను సన్మానించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్స్ ఉమాపతి, రాజేష్‌లను పట్టుశాలువతో సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్, ఫౌండేషన్ ప్రతినిధి విశ్వనాథ్ రంగా, తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో పూర్తిస్థాయి రుణమాఫీపై అవగాహన

వేల్పూర్,ఆగస్టు19:మండలంలోని పచ్చలనడ్కుడలో పూర్తి స్థాయి రుణమాఫీ పై విధివిధానాలపై రైతులకు సోమవారం వ్యవసాయాధికారితో పాటు కాంగ్రెస్ నాయకులు అవగాహన కల్పించారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డిల ఆదేశాల మేరకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కురి గంగాధర్ ఆధ్వర్యంలో ఏఈవో వినయ్‌ని గ్రామానికి పిలిపించి రైతులకు రుణమాఫీపై అవగాహన కల్పించారు. రుణమాఫీ కానివారు అధైర్యపడవద్దని సూచించారు. ఇక్కడికి వచ్చిన రైతులకు రుణమాఫీపై వారి ఆధార్‌కార్డు ద్వారా కొన్ని వివ రాలను వివరించారు. రుణమాఫీపై, ఇతర ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కురి గంగాధర్, కొన్ని సాంకేతిక లోపలతో కొంత మందికి రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే సాంకేతిక లోపాలను సరిచేసి రైతులందరికి రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జల్ల భూమన్న, పోగుల గంగాధర్, న్యాయం రమేష్, రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ కార్య కర్తలు, ఉన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

● షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

జక్రాన్‌పల్లి: ఏకకాలంలో షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని రైతులు తెలిపారు. సోమవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో ఈనెల 24న ఉదయం 10గంటలకు మైత్రి కళ్యాణ మండపంలో రైతులు సమావేశం కానున్నట్టు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశానికి ప్రతీ ఇంటి నుంచి రైతులు హాజరుకావాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రైతు ఐకాస, రైతులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లిలో సమావేశమైన రైతు ఐకాసా సభ్యులు

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్, ఆగస్టు 19: అర్సపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సిజిఆర్ఎఫ్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం మంగళవారం ఏర్పాటు చేయనున్నట్లు టౌన్-1 ఏడిఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు వినియోగదారులు తమ సమస్యలను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, ఫోర్త్‌మెంబర్ రాజాగౌడ్ రానున్నారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళం

నవీపేట,ఆగస్టు19: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయం అభివృద్ధికి మాజీ సర్పంచ్ సరిన్ 26,116రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేష్, స్వామి, రాజేశ్వర్, సుధాకర్, మోహన్, నవీన్ తదితరులున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఆందోళన

రుద్రూరు, ఆగస్టు 19:రుద్రూరు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో ఇళ్లు లేని నిరుపేదలు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కబ్జాకు పాల్పడ్డారు. ఎంత మంది నాయకులకు చెప్పిన అధికారులకు చెప్పిన తమ బాధను పట్టించుకోవడం లేదని నిరుపేదలు స్వతహాగా డబుల్ బెడ్ రూమ్‌ల కబ్జాకు పాల్పడ్డారు. డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి సంవత్సరం అయినా పేద వారికి డబుల్ బెడ్ రూమ్‌లు అందజేయడం లేదని జేఎన్‌సీ కాలనీ నిరుపేదలు ఇష్టం వచ్చినోళ్ళు ఇష్టం వచ్చిన డబుల్ బెడ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. డబుల్ బెడ్ రూమ్ బయట ఆధార్ కార్డులు పెట్టి ఇళ్ళపైన పేర్లు రాయించుకుంటున్నారు. నాయకులు ఇచ్చేది ఎప్పుడో మేము తీసుకునేది ఎప్పుడో అనే విధంగా ఉందని అందుకే తామే స్వతహాగా వచ్చి కబ్జా చేశామని జేఎన్‌సీ కాలనీ వాసులు తెలిపారు. అనంతరం అనంతరం తహసీల్దార్ వెంకటేశం, సీఐ జయేష్‌రెడ్డి, ఏఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది, మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్‌లు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అర్హులైన ప్రతి నిరుపేదకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేస్తామని వారిని సముదాయించారు. దీంతో నిరుపేదలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

బోధన్ రూరల్, ఆగస్టు 19 : రుద్రూర్ మండల కేంద్రంలో 11-11-2023న తండ్రిని చంపిన తనయుడి కేసులో కొడుకు నక్క సాయిలుకు బోధన్ 5వ అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్ జీవితఖైదు విధిస్తూ తీర్పును వెల్లడించారని కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రుద్రూర్ మండల కేంద్రంలో 11-11-2023నాడు రాత్రి సమయంలో తండ్రి నక్క చిన్న పోశెట్టి కొడుకు నక్క సాయిలుకు గొడవ జరుగగా కొడుకు నక్క సాయిలు తండ్రిని కొట్టి గొంతు పిసికి చంపాడని వివరించారు. అనంతరం స్వచ్ఛందంగా లొంగిపోవడంతో కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితుడు నక్కసాయిలు తండ్రిని చంపిన కేసును ఒప్పుకున్నందున 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్ జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని, వెయ్యి రూపాయలు చెల్లించని పక్షంలో మరో రెండు సంవత్సరాలు జైలులో సాధారణ జీవితం గడపాలని తీర్పులో వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరజ్, సీఐ జయేష్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడికి..

బోధన్‌రూరల్, ఆగస్టు 19 : రెంజల్ మండలం నీలా గ్రామంలో 17-7-2019నాడు అన్నను కక్షపూరితంగా చంపిన కలీం ఖురేషిని 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ జీవిత ఖైదీతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించినట్లు కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నీలా గ్రామంలో నివాసం ఉంటున్న కలీం ఖురేషి అనే వ్యక్తి తన అన్న సలీంపై కక్ష పెంచుకుని 14-07-2019లో రాత్రిపూట కత్తితో కడుపులో పొడవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కేసు పూర్వపరాలు పరిశీలించగా కలీం ఖురేషి నేరం ఒప్పుకున్నందున సోమవారం అన్నను చంపిన తమ్ముడు కేసులో జీవిత ఖైదు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారన్నారు. వెయ్యి రూపాయలు కట్టని యెడల రెండు సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు, రెంజల్ ఎస్ఐ సాయన్న, రూరల్ సీఐ కోలా నరేష్, రాములు, మనోహర్, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

తగిలేపల్లిలో అన్నదానం

వర్ని,ఆగస్టు19: వర్ని మండలం తగిలేపల్లి గ్రామ పరిధిలోని రూప్లానాయక్ తండాలో సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది అయ్యమరం ఆలయం వద్ద శ్రావణ మాసం సందర్భంగా గ్రామ ప్రజలు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గుజ్జ శంకర్, బక్క రాములు, తొంట కేశవ్, గుజ్జ అశోక్, భజన మండలి సభ్యులు నగేష్, మావురపు గంగారాం, పాన్సరి రామాగౌడ్, దన్పూర్ సాయిలు, సాయిలు, పెద్ద గంగారాం, సురేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో పూజలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు19: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మార్కండేయ ఆలయంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శేఖర్, పద్మశాలి సంఘం సభ్యులు గంగాధర్, భూపతి, ప్రసాద్, రామ చందర్, స్వామి, మధు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : వేల్పూర్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం జంద్యాల పుణ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని కుల సంఘ సభ్యులు మార్కండేయునికి పూజలు చేసిన అనంతరం నూతన జంద్యాలను ధరించారు. సంఘం అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు దేవిరాజేందర్, కోశాధికారి బాస గంగాధర్, మార్కండేయ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎస్‌హెచ్‌వో

కమ్మర్‌పల్లి, ఆగస్టు 19: పోటీపరీక్షలకు సద్ధమవుతున్న అభ్యర్థులు సమయాన్ని వృథాకానియకుండా పరీక్షల పట్ల ప్రత్యేక దృష్టిసారిస్తు, కృషి పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కమ్మర్‌పల్లి ఎస్‌హెచ్‌వో అనీల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంతీయ ఉపా ధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వివేకానంద స్టడి హాల్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపస్ ఆధ్వర్యంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడి మెటీరియల్, స్టడి చైర్, ప్యాడ్‌లను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సదావకాశాన్ని మండలంలోని పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకుల సూచనలమేరకు అభ్యర్థులకు తమవంతు సహాయసహకరాలు అందిస్తామని హామీఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారనిమిత్తం ఉద్యమాలు సాగిస్తునే మరోవైపు భావితరాలకు ఉపయోగపడే విధంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం కమ్మర్‌పల్లి శాఖను తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి అభినందించారు. ఈ సందర్భంగా స్టడీ మాల్‌ను సమకూర్చిన సరస్వతిశిశుమందిర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ మండ అధ్యక్షులు సుంకెట రవి, పిల్లి ఈశ్వరయ్య, తాపస్ మండలశాఖ అధ్యక్షుడు సల్లూరి కిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమేష్ డివిజన్ కార్యదర్శులు ఆనంద్, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమ్మర్‌పల్లి ఎస్‌హెచ్‌వో అనీల్‌రెడ్డి

తూతూ మంత్రంగా గుంతల పూడ్చివేత


గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

మోస్రా,ఆగస్టు19: మండల కేంద్ర శివారులో మోస్రా నుంచి నిజామాబాద్, మోస్రా నుంచి గోవూర్ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేయాలని వాహనదారులకు ఇబ్బంది అవుతున్న విషయం విదితమే. కాని ప్రస్తుత సమస్యలు పరిష్కారం చేసేందుకు కంకర రాళ్లు, చిప్స్ వేసి గుంతలు కొంత మేర పూడ్చారు మరి కొంత మేర పూడ్చడం మరిచారు. ఇదీ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని వాహనదారులు అభిప్రాయ పుడుతున్నారు. ఇంతకు ముందు గత నెలలో వేసిన ఇలాంటి కంకర చిప్స్ గుంతలో నిలవక పోగా మళ్లీ ఇవ్వే రాళ్లు వేయడం హాస్యస్పదంగా ఉందని ఫోర్ వీర్స్ వాహనదారులు అంటున్నారు. అంతే కాక రాత్రి వేళల్లో గుంతల్లో వాహనం పడితే బోల్తా పడే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు.ఈ విషయమై ఏఈ జియాన్ మాట్లాడుతూ సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయాలని తెలిపాము. కాంట్రాక్టర్ చేస్తాము అని తెలిపారు. ప్రస్తుత సమస్య పరిష్కారం కోసం కంకర చిప్స్ వేసి గుంతలు పూడ్చివేస్తున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినికి అభినందనలు

నవీపేట, ఆగస్టు19: ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మండలంలోని జడ్పీహెచ్ఎస్ బినోలలో 10వ తరగతి చదువుతున్న కే.భవాని పాల్గొన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన ప్రేరణ అనే కార్యక్రమంలో పాల్గొని జిల్లా నుంచి ఆమె ఒక్కరే ఈ వేడుకలలో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. వేడుకలలో పాల్గొన్న భవాని సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఆమె కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిశారు. ఈ మేరకు కలెక్టర్ భవానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయిన మోహన్ రెడ్డి, ఉపాధ్యాయురాలు సరిత, తదితరులున్నారు.

ద్విచక్ర వాహనదారులు
హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కోటగిరి,ఆగస్టు19: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని కోటగిరి ఎస్ఐ సందీప్ సూచించారు. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో సోమవారం హెల్మెట్‌ల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ఉంటే ప్రాణపాయం తప్పుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలకు తప్పనిసరి నెంబర్ ప్లేట్‌లు ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది ధర్మేందర్, సంతోష్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవీపేట, ఆగస్టు 19 : మండలంలోని శివతండాకు చెందిన నునావత్ లాలు అనే 32సంవత్సరాల వయసు గల వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 17న రాత్రి తన భార్యతో గొడవ పడి మద్యం మత్తులో బయటకు వెళ్లాడని అతని కోసం కుటుంబ సభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదని అన్నారు. భార్య నునావత్ బుజ్జి ఫిర్యాదు మేరకు సోమవారం అదృశ్యం కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

తొర్లికొండలో ఘనంగా ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు19: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఉంజల సేవ కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఉంజాల సేవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుప్రభత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు భక్తులు, తొర్లికొండ గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,ఆగస్టు19: శ్రావణ మాస ఉపాకర్మ కార్యక్రమాన్ని సోమవారం బ్రహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో వేద పండితులు అనంత జోషి, కృష్ణ జోషి మంత్రోచ్ఛరణల మధ్య శ్రావణ మాస ఉపాకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మణ్ సమాజ్ అధ్యక్షులు ప్రవీణ్ మహరాజ్, ఉమానంద్ వైద్య, మనోజ్ వైద్యరాం శాస్త్రి, సునీల్ భాస్కర చార్య, బ్రాహ్మణులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతిచెందిన మహిళ

ఎల్లారెడ్డి, ఆగస్టు 19 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కట్ట కింది తండాకు చెందిన కేస్లీ బాయి (60) కడుపు నొప్పితో బాధపడుతూ ఈనెల 12వ తేదీన సాయంత్రం వైద్యం కోసం ఆసుపత్రిలో చేరింది. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించగా కడుపులో కణితి ఉందని తేలింది. కుటుంబసభ్యుల కోరిక మేరకు వైద్యులు ఆపరేషన్ చేసి కణతిని తొలగించారు. ఆపరేషన్ చేసిన ఆరు రోజులు తరువాత సోమవారం మహిళ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మహిళ మృతిచెందిందని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆసు పత్రి వద్ద వైద్యులతో ఆగ్రహంతో వాగ్వాదానికి దిగి ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై డాక్టర్ వివరణ కోరగా వైద్యసేవలు యథావిధిగా అందించామని, కాని హార్ట్‌స్ట్రోక్‌తో మృతి చెందినట్లు తెలిపారు.

కొవ్వొత్తులతో నివాళి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 19: పశ్చిమ బెంగల్‌లోని కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న పీడీ మెడికల్ విద్యార్థినిపై లైగికదాడికి పాల్పడి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కమ్మర్‌పల్లి యువకులు డిమాండ్ చేశారు. ఈ మెరకు సోమవారం రాత్రి స్థానిక భరతమాత విగ్రహంవద్ద కొవోత్తులతో ఘనంగ నివాళులర్పించారు. ఈలాంటిఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రాయువత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలి

నవీపేట,ఆగస్టు19: మండల కేంద్రంలోని బాసర రోడ్డు వద్ద సోమవారం పోలీసులు ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్‌లు వాహనాలు నడిపితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

బోధన్‌రూరల్,ఆగస్టు19: బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి చౌరస్తాలో గల సూపర్‌మార్కెట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ ఘటన చోటు చేసుకుంది. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సూపర్‌మార్కెట్‌పైన రేకులను తొలగించి పీఓపీ కట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారని, దుకాణంలో రూ.15లక్షల అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వరుసగా బ్యాంకు సెలవులు రావడంతో డబ్బులు షాపులో ఉంచినట్లు యాజమాని పేర్కొన్నారు. పట్టణ సీఐ వీరయ్య సూపర్‌మార్కెట్ పరిశీలించి అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. సీసీ పుటేజీల ద్వారా త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

హెల్మెట్ ధరించని వారికి రాఖీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు19: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి రాఖీలను కట్టారు. కాలనీలోని యువతులు, చిన్నారులు ద్విచక్ర వాహ నాలు నడుపుతున్న వారికి హెల్మెట్ ధరించాలని, కారును నడిపేవారికి సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని వారు సూచించారు. హెల్మెట్ లేని వారికి హెల్మెట్‌లను అందజేశారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా నిజామాబాద్ జిల్లా జట్టు



విజేతగా నిలిచిన జిల్లా జట్టు

సుభాష్‌నగర్, ఆగస్టు 19: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో జిల్లా జట్టు మొదటి నుంచి అద్వితీయమైన ప్రతిభతో ప్రతీ పోటీని గెలుచుకుంటూ ఛాంపియన్‌గా నిలిచింది. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ వర్సెస్ నల్గొండ పోటీ పడగా మెదక్ జట్టు 2-0తో గెలిచింది. రెండవ సెమీ ఫైనల్‌లో నిజామాబాద్ వర్సెస్ ఖమ్మం పోటీ పడగా గుగులోత్ సౌమ్య హ్యాట్రిక్ సాధించి జట్టును ఫైనల్‌కే చేర్చింది. మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురవడంతో నిర్వాహకులు టాస్ వేసి విజేతను ప్రకటించారు. టాస్ నిజామాబాద్ గెలవడంతో నిజామాబాద్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. మెదక్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే కమాన్ బ్రిడ్జి రాకపోకల పనుల పరిశీలన



నగరంలో రైల్వే కమాన్ వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 19: నగరంలో భారీ వర్షం కురవడంతో రైల్వే కమాన్ వద్ద భారీగా వర్షం నీరు చేరుకుంది. సుమారు గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ అక్కడికి చేరుకొని పునరుద్ధరణ పనులు పరిశీలించారు. జెసిబిల సహాయంలో నిలిచిఉన్న వర్షం నీటిని డ్రైనేజీలోకి పంపేలా తన సిబ్బంది పనులు చేయించారు. వాహనాల రాకపోకల పునరుద్దరణ అయ్యే వరకు అక్కడే ఉండి పరిస్థితి సమీక్షించారు.

● నగర పాలక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ కమిషనర్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రెండు రోజుల పాటు భారీ వర్షాల సూచన ఉండటంతో నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమీషనర్ మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల నుంచి వరద నీరు తొలగింపుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రుణమాఫీ చేయాలని రాస్తారోకో



వెల్మల్‌లో రాస్తారోకో చేస్తున్న బాధిత రైతులు

నందిపేట, ఆగస్టు19: నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామంలో సోమవారం బాధిత రైతులు తమకు రుణమాఫీ చేయాలంటూ ఆందోళనకు దిగారు. నందిపేట, నిజామాబాద్ మెయిన్‌రోడ్డుపై భైటాయించి రాస్తారోకో చేశారు. తమకు అన్నిఅర్హతలు ఉన్న ప్రభుత్వం రుణమాఫీ చేయాలేదంటు బాధిత రైతులు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై హరిబాబు, మండల వ్యవసాయాధికారి జోష్నభవాని సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు సద్దిచెప్పారు.ఏవోరైతులతో సమావేశమై నియమ నిబంధ నల ను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే అర్హులందరికి రు ణమాఫీ జరుగుతుందని ఆమెతెలిపారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులు ఉన్నారు.

● దేగాంలో దక్కన్ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో సోమవారం దక్కన్ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9వరకు రైతులు రుణాలు తీసుకోవాలని, ప్రతీ రైతు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తా నని ప్రకటించారని రైతులు గుర్తు చేశారు. తీరా అధికారం చేపట్టక రైతులకు రుణమాఫీ చేయడంలో అనేక ఆంక్షాలు విధిస్తున్నారని వారు విమర్శించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు గ్రామంలో కొద్దిసేపు రాస్తారోకో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ గడ్డం గంగారెడ్డి, సీహెచ్.రాజేశ్వర్, మచ్చర్ల మహిపాల్, దుమాల రమేష్, ప్రణీత్, రాజమల్లారెడ్డి, రైతులు, యువకులు పాల్గొన్నారు.

● ఆలూర్‌లో అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని వినతి

ఆర్మూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో సోమవారం వ్యవసాయాధికారి హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కొన్ని గ్రామాల్లో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు రుణమాఫీ రాకుండా పోతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, జిల్లా పార్టీ నాయకులు మూలకిడి శ్రీనివాస్‌రెడ్డి, కల్లెం మల్లారెడ్డి, నవదీప్, ఉదయ్, బాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, వెల్మ గంగారెడ్డి, వంశీ, రాజేందర్, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఏవో హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా అంతటా ఘనంగా రాఖీ పౌర్ణమి



నగరంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు రాఖీ కడుతున్న మహిళలు



ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి



బోధన్ వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 19: దేశభక్తిని నింపే ఇలాంటి సాంప్రదాయ పండుగ ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీ ఆర్గనైజేషన్, తెలంగాణ సమగ్ర శిక్షణా ఉద్యోగుల ఆధ్వర్యంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో ఏదేశంలో లేని పండుగ కేవలం మన భారత దేశంలోనే సోదర భావానికి ప్రతీకగా దేశమంతటా జరుపుకునే పండుగ రాఖీ పండుగ అని అన్నారు. ఇది అనాది కాలంగా వస్తుందని భారతదేశానికి ఒక గొప్ప చరిత్ర సంస్కృతి సంప్రదాయం కలిగి ఉందని అన్నారు. భారతీయులంతా నా సోదరీమణులంటూ పరాయి స్త్రీని కూడా అక్కగా, చెల్లిగా చూసే గొప్ప సంస్కృతి మన దేశంలోనే ఉందని అలాంటి సంస్కృతిని సోదరభావాన్ని పెంపొందించే పండుగ రాఖీ పండుగ అంటారన్నారు. ఈ కార్యక్రమంలో వనజ, సుజాత, ఓం శాంతి తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● మోపాల్ మండల గ్రామాల్లో ఘనంగా రాఖీ పౌర్ణమి

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెళ్లకు, అక్కాతమ్ముళ్లకు రాఖీ కట్టి ప్రేమానురాగాలను తెలియజేసే పండుగ రాఖీ పండుగ. ఈ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి రక్షణగా ఉండాలని కోరుకుంటారు.అదేవిధంగా మండలంలోని బోర్గాం (పి),న్యాల్‌కల్, మాధవనగర్, మోపాల్, సిర్పూర్, బాడ్సి, చిన్నాపూర్, ముదక్‌పల్లి, కంజర్, కులాస్‌పూర్, మంచిప్ప, కాల్పోల్, భైరాపూర్, అమ్రాబాద్, గుడితండా, ఒడ్డెర కాలనీ, శ్రీరాంనగర్ తండా, కులాస్‌పూర్ తండాల్లో ఈ పండుగను ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

● కమ్మర్‌పల్లిలో ఘనంగా రాఖీ పౌర్ణమి

కమ్మర్‌పల్లి:అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ కార్యక్రమాన్ని మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం దేవాలయాలలో, ఇళ్లలో తమ ఆర్యాధైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు, తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వచనాలు అందుకున్నారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మండల ప్రజలకు రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

వేల్పూర్: అన్నాచెల్లెళ్లకు అక్కతమ్ముళ్లకు ప్రతీకగా నిలిచే రాఖీపౌర్ణమి వేడుకలు సోమవారం వేల్పూర్ మండల గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు.అక్కాచెల్లెళ్లు వారిఅన్నదమ్ములకు రాఖీకట్టిలు స్వీట్లు తినిపిం చారు.

మాక్లూర్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మండల ప్రజలు రక్ష బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోదరులకు సోదరిమణులు రాఖీలు కట్టి రాఖీ పండగను జరుపుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో అన్నదమ్ముళ్ళకు, అక్కచెల్లేళ్లు రాఖీలు కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించారు. రాకి కట్టిన అక్కచెల్లెళ్లకు కానుకలు ఇచ్చారు.

పెర్కిట్: అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతీకగా జరుపుకున్న రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఆర్మూర్‌లోనిర్వహించారు.అక్కాచెల్లెలతో ఇల్లా ంత కోలాహలం మధ్యమితాయిలు తినిపించుకుంటూ అన్నదమ్ముళ్లకు రాఖీ కట్టారు.

నవీపేట: సోదర, సోదరిమణుల అనురాగం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను సోమవారం యంచలోని సంతోషి మాత ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరిమణులు సోదరుల చేతికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు. అలాగే మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీలో విద్యార్థినులు పాఠశాలకు వచ్చిన తమ సోదరుల చేతికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం రాఖీ పౌర్ణమిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోదరి, సోదరిమణులు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆనందోత్సహాలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు.

డిచ్‌పల్లి:ధర్మారం(బి)లో వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాస్వామి వారిని ప్రత్యేకంగా చేసిన నైవేథ్యాలు సమర్పించారు. అలాగే ఖిల్లా డిచ్‌పల్లిలో మార్కండేయ స్వామికి పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో పద్మశాలీకుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

వర్ని: వర్ని, చందూర్ మండలాల పరిధిలో సోమవారం రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో సోదరులకు సోదరి మణులు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. యువకులు ఇంటింటికి రాఖీలు పంపిణీ చేశారు.

ధర్పల్లి: మండల కేంద్రంలోగల పద్మశాలీ భవన్‌లో నూలు పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుక రాజు, గ్రామ అధ్యక్షుడు పాము నారాయణ, ఉపాధ్యక్షుడు భూమేష్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి డాక్టర్ నందు, వీడీసీ చైర్మన్ మహేందర్ పాల్గొన్నారు.

రుద్రూరు:అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. అన్నతమ్ముళ్ళకు తిలకం దిద్ది వారి అక్కలు చెల్లెళ్ళు రాఖీలు కట్టి ఈ బంధం జన్మ జన్మలు కొనసాగాలని ఆశీర్వదించారు.

● బోధన్‌లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాఖీ పౌర్ణమి అన్నచెల్లెళ్లకు అనుబంధంగా ఉంటుందని, అన్నచెల్లెళ్లు, అన్నదమ్ములకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. శివాలయంతో పాటు వెంకటేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం సందర్భంగా శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులతో పాటు కాంగ్రెస్ నాయకులు, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్‌చారి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, దాము, ధూప్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదినారాయణ, వివిధ గ్రామాల నుంచే కాక మహరాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

● డీసీసీబీలో రాఖీ వేడుకలు

నిజామాబాద్ అర్బన్:నిజామాబాద్ సహకార కేంద్ర బ్యాంక్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో డీసీసీబీ సిబ్బంది పాల్గొన్నారు. బ్యాంకు ఆవరణలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్‌కు చెందిన వారు వచ్చి చైర్మన్ రమేష్ రెడ్డితో పాటు సిబ్బందికి రాఖీ కట్టారు.

మెండోర: మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రక్ష బంధనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి పల్లకిసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణ సుత్రాదారణమనే ఆచారమే కాలక్రమేన స్త్రీలు పరాయి పురుషులను సోదరులుగా భావించి రాఖీ కట్టి సంప్రదాయంగా ప్రచుర్యాన్ని పొందింది. ఈ రాఖీ కట్టడంతో పురుషుడు స్త్రీలకు రక్షణగా ఉండాలనే దీని యొక్క అర్థమని అన్నారు. పౌర్ణమి రోజు వచ్చే పవిత్ర పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి అని గంజాల పౌర్ణమి చెల్లల పండుగగా అంటారు. రక్షక పౌర్ణమిని సంస్కృతంలో దీని పేరు రక్ష అనగా రక్షించడం అని అర్థం రక్షక వికృతి రూపం రాఖీ పౌర్ణమి అయింది. అందుకే రాఖీ పండగా సందర్భంగా చెల్లెల్లు, అక్కలు అన్నదమ్ములకు రాఖీలు కడుతుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ..



యంచ సంతోషి మాత ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



ధర్పల్లిలో రాఖీ వేడుకలో పాల్గొన్న పద్మశాలీలు



ధర్మారం(బి) వెంకటేశ్వర స్వామి ఆలయం పూజల్లో పాల్గొన్న భక్తులు



మోకన్‌పల్లి కేజీబీవీలో సోదరులకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 19: ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 20 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్‌డివో సాయాగౌడ్, అదనపు ఎస్పీ బస్వారెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో భారీ వర్షం

వేల్పూర్, ఆగస్టు19: వేల్పూర్ మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది.మధ్యా హ్నం 2.30గంటల నుంచి 20నిమిషాల పాటు భారీవర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి అడపదడప వ ర్షాలతో ఎండ వేడిమికి ప్రజలు ఉడకపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురువడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నవీపేట: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా 2గంటల తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరిగి భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోటగిరి,ఆగస్టు19: కోటగిరి మండల కేంద్రానికి చెందిన సావిత్రి(30)అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది సావిత్రి మూడురోజుల క్రితం పురుగుల మందు సేవించింది. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



నందిపేటలో బాధితులకు బీమా చెక్కులను అందజేస్తున్న ఎస్సై

నందిపేట, ఆగస్టు19: నందిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబసభ్యులకు సోమవారం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కులను ఎస్సై ఏ.హరిబాబు అందజేశారు. మండలంలోని ఉమ్మెడ గ్రామానికి చెందిన ఆరేపల్లి చిన్నయ్య, నందిపేటకు చెందిన గాండ్ల అంజయ్య, డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన ఆరే సైదయ్యలు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను అందజేశారు. ఒకరికి రూ.4లక్షలు, మరోకరికి రూ.5లక్షల 80వేల, ఇంకొక్కరికి రూ.5లక్షల 70వేల చెక్కులను శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ఈడీ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై హరి బాబు మాట్లాడుతూ ప్రతీఒక్కరు బీమా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నాగ సురేష్, స్థానిక నాయకుడు రాజు, మురళీ,ఉద్యోగులు పాల్గొన్నారు.

'సేవా తత్పరుడు గడ్డం రాజారెడ్డి'



గడ్డం రాజారెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు19: ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవా తత్పరుడు, వితరణ శీలి, లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు గడ్డం రాజారెడ్డి (పైపుల రాజారెడ్డి) మృతి తీరని లోటని ఆర్మూర్ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజారెడ్డి మొదట ఆర్మూర్ ప్రాంతంలో వీడీవోగా పని చేశారు. వ్యాపారంపై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యాపారంలోకి ప్రవేశించారు. మహరాష్ట్రలోని సోలా పూర్‌లో, హైదరాబాద్‌లో పలు పైపుల ప్యాక్టరీలను స్థాపించారు. దీంతో గడ్డం రాజారెడ్డి పైపుల రాజారెడ్డిగా జిల్లాలో ప్రసిద్ధి గాంచారు. వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి ప్రము ఖ పారిశ్రామిక వేత్తగా పేరుగాంచారు. 2009 సంవత్సరంలో రాజారెడ్డి సతీమణి సుశీలరెడ్డి మృతి చెందడంతో తన సతీమణి జ్ఞాపకార్థం ప్రజలకు ఏదో ఒక సేవ చేయాలని సంకల్పించి అంకాపూర్ గ్రామంలో లాలన వృద్ధాశ్రమానికి శ్రీకారం చుట్టారు. ఏలాంటి లాభపేక్ష లేకుండా సొంత నిధులతో ఏర్పాటు చేయాలని భావించి 2011సంవత్సరంలో ఆశ్రమం నిర్మాణం పూర్తి చేసి వృద్ధులను చేర్చుకున్నారు. అప్పటి నుంచి 70మంది వృద్ధులకు ఆశ్రమంలో కుల, మతలకు అతీతంగా వృద్ధులను చేర్చుకొని సేవలందిస్తున్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు ప్రతీ వారం వైద్యునిచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

22న ఇందిరా పార్క్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి

● డిచ్‌పల్లిలో పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ నాయకులు

డిచ్‌పల్లి,ఆగస్టు 19 కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హమీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఈ నెల 22న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా ను విజయవంతం చేయాలని సోమవారం డిచ్‌పల్లిలో పోస్టర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా నాయకుడు సాయాగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నూతన రేసన్ కార్డులు ఇస్తామని చేయూత పింఛాన్ 4వేలు రూపాయలు ఇస్తామని ప్రకటించి ఇంత వరకు అమలు చేయాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హమీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగామల్లు, పద్మ, అమృత, రాజవ్వ, చంద్రయ్య, రాజు, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74100	రూ.68,300	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డబుల్ ఇస్మార్ట్ (9.00, 7.05)
: మిస్టర్ బచ్చన్ (12.25, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (3.50)
స్క్రీన్-2 : మిస్టర్ బచ్చన్ (9.10, 7.15)
: డబుల్ ఇస్మార్ట్ (12.35, 10.40)
: కమిటీ కుర్రాళ్లు (4.00)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (9.50, 1.05, 10.40)
: ఖేల్ ఖేల్ మెన్ (హిందీ) (4.20)
: తంగాలన్ (7.20)
స్క్రీన్-4 : తంగాలన్ (9.30, 12.50, 4.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
: వేధ (హిందీ) (10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డబుల్ స్మార్ట్ (10.10, 4.15)
: తంగలాన్ (1.15, 7.20, 10.20)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (10.20, 7.20)
: మిస్టర్ బచ్చన్ (1.20)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.20, 10.20)
స్క్రీన్-3: మిస్టర్ బచ్చన్ (10.10)
: డబుల్ ఇస్మార్ట్ (1.10, 7.10, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (4.15)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (6.15, 9.15)
నటరాజ్ : స్త్రీ-2 (హిందీ) (11.15, 2.15,6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15,6.15, 9.15)
లలితామహాల్ : డబుల్ స్మార్ట్ (11.15, 2.15,6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్